# మనుమరాలు

కాజ వేంకటపద్మనాభ రావుగారు

ఒకప్పుడు ఆమెముఖం పూర్ణచంద్రుని వలె దివ్యమోహనంగా ఉండేది. చిరునవ్వు లందు చిందులాడేవి. వికసించిన పుష్పముల వలె ఆమె నేత్రములు విద్యుత్కాంతులు వెదజల్లేవి. సరిగా దువ్వబడిన ఆమె ముంగురులు ముఖముమీద నాట్యం చేస్తుండేవి. శిఖలోసిపూలు నూత్నశోభను కలిగించేవి. చక్కని చీరలు ధరించేది. రంగురంగు రవికెలు తొడిగేది. శ్రవణానందకరమగు గానమునకు ఆమె అనుదినము వింత మెరుగు పెట్టేది. ప్రపంచములో తనే సుఖజీవి అని అనుకునేది. ఆనందడోలికలలో వూగులాడేది......అవి పూర్వపురోజులు.

కాలచక్రం తిరిగిపోయింది. మెరుపులేని అమావాస్యరాత్రి ఆమెజీవిత మిప్పుడు. గత దినములు నక్షత్రమాత్రంగా మిణుకుమిణుకు మంటూవున్నవి. యిపుడు ఆమె స్మృతిపథమున అవి వెలుగునీయ లేవు. అమావాస్యయనుట కవే ప్రత్యక్షము. కళావిహీనమైన ఆమెవదన మందు విషాదము రేఖలు దిద్దింది. దుఃఖమూ హృదయములో గడ్డ కట్టుకుంది. ఎప్పుడూ కన్నీటి బిందువులు రాలుస్తుంది. ఎన్నడైనా సవతితల్లి చీవాట్లుపెట్టితే నేత్రాంతికములలో శోకం కుదించుకొని క్రిందకు చూస్తుంది. నోరెత్తి మాట్లాడలేదు; చీకటిగదిలో శిథిలమైన నిద్రతో మంచంమీద పరుండియుంటుంది. పనిచేయలేదని తిడితే కన్నులు చిల్లులుపడేటట్లుగా ఏడుస్తూ పనులుచేస్తుంది.

ఆభగ్నహృదయమునకు సంతోషమెక్కడిది? ఆమెయొక ప్రేమపిపాసిని. కాని యొక విపరీత విధి యాహృదయమందలి యానందజ్యోతి నెత్తుకపోయింది. నేడొక శూన్యహృదయము. అందు జీవవాహినులు యింకిపోయినవి. ఆమె యొక నిర్జీవప్రతిమ...ఆమె నేడు అనాథ.

అయినా ఒకనాడు ఆమె కోర్కెలు రెక్కలుకట్టుకుఎగరటానికి ప్రయత్నించాయి. కాని పంజరం అడ్డువచ్చింది. నల్లటి కురుల చాలును బాగాదువ్వి జడవేసుకుంది. ఎక్కడో పెట్టెఅడుగున దిక్కుమాలిన బ్రతుకుతో దీనంగా చూస్తున్న చీరెతీసి కట్టుకుంది. అద్దంలో చూసుకొని సంతోషిద్దామని, ఆ విధముగానైనా కోరికలను ఆనందపరుద్దామని తలచింది. ఈమాత్రానికే, దేవుడు సహించ లేకపోయాడు. తల్లికంట బడింది. గ్రుడ్లు చింతనిప్పులలాగ మెరుస్తున్నాయి:—

'ప్రభా! నీకు జ్ఞానంలేదా? ఎన్నిసార్లు చెప్పాలి? పరువుప్రతిష్టలు లేవా నీకు? లోకు లేమనుకుంటున్నారు? చెడిపోయే రోజు లొచ్చాయి నీకు; రోజురోజుకు యిలాంటి బుద్ధులు పుడుతున్నాయి ఏమిటి?' అని తల్లి ప్రభ జడలోని పూలుతీసి నేలకు కొట్టింది. నోరులేనిపూలు స్పృహతప్పి క్రిందపడి పోయాయి.

నిశ్చేష్టురాలయింది ప్రభ. గడగడవణి కింది. గ్రుడ్లుకరిగి చెక్కిళ్ళమీద ప్రవహిస్తు న్నాయి. నోటమాటలేదు. తల్లివంకదీనంగా

చూచింది. తల్లికళ్ళలో కనపడే కఠినతకు ఎదురుగా నిలబడలేకపోయింది. శోకభారం దుర్భరమయేసరికి ప్రక్కగదిలోని కెళ్ళింది. మంచంమీదకూర్చుని వెక్కి వెక్కి ఏడవటం మొదలుపెట్టింది.

కొంచెంసేపయాక తండ్రి లోపలికివచ్చాడు. తల్లితీక్ష్ణదృక్కులకు ఆమెవదనం కమిలి పోయింది; హృదయం కుమిలిపోయింది. చూచేటప్పటికి చాలవిచారంవేసింది అతని కిది. ఆమె నవయువ్వని. సహజంగా కోర్కెలుం టాయి. కన్నులు మూయగలంగాని మనస్సు మూయగలమా? బిక్కముఖంతో కూర్చుంది పాపం! తండ్రి చాలా ఖిన్నుడయాడు. కాని సంఘాన్ని ధిక్కరించలేడు. కూతురుకోసం తన పరువు ప్రతిష్టలు పోగొట్టుకోలేడు. పైకి కఠినుడుగా వుండకపోతే కూతురు చెడిపో తుందని యతనిభయము.

'ప్రభా! నీవు కొంచెం హద్దుమీరు తున్నట్లు కనబడుతుంది. ఈవేషం ఏమిటి? ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు? ఏమీ లాభం లేనపుడు వెర్రికోర్కెలు పెట్టుకుంటే ఏమి ప్రయోజనం చెప్పు? నీవంటే సంఘానికి చులకనయౌతుంది. కొంచెం జాగ్రత్తగ మెలగాలి.' అన్నాడు.

అశ్రుపూరితనయనాలకు చీరె చెంగు అడ్డుపెట్టుకుంది ఆమె.

రాత్రి తొమ్మిదయింది. ప్రభగదిలో ఒక మూలకూర్చుంది. ఉండివుండి కొంగుచాటున కంట తడిపెట్టుకుంటోంది. ఆడుజన్మంత వెనవ జన్మ ఏదీ లేదనుకుంటుంది; అందులో బాల వితంతువుఅగుట ఎదో ఘోరపాతకాలఫలితం అనుకుంది. ఇలా ఆలోచిస్తూ, ఆలోచిస్తూ నిద్రపోయింది...తల్లివచ్చి నిదుర హృదయం అదిరేటట్లు పిలిచేటప్పటికి తియ్యనికలకం టోంది. నిద్రలేని ఆమెకన్నులు కెంపులులాగ మెరుస్తున్నాయి. తల్లిమాటలు ఆమె హృదయంలోని చిచ్చును విసురుతున్నాయి. అస్వతంత్రురాలు ఆమె.

మేడమీద రమేషు యింకా నిద్రలేవలేదు. క్రిందటిరాత్రి జరిగిన సంగతంతా అతనికి తెలియదు. సవతితల్లి అంటే అతనికి అసహ్యమే. ప్రభయందు అతనికి ఎక్కువ ప్రేమ. ప్రభ వచ్చి అతనిని నిద్రలేపింది.

'ప్రభా! రాత్రి నాగదిలోనికి రాలేదేం? నిన్ను పిలుద్దామనుకున్నాగాని మాటలతో ప్రొద్దుపోతుందేమో అని పిలవలా.'

'పోనీలే. ఇంకా నిద్రలేవలేదేమి? నిన్న పిన్ని కేకలేసింది అన్నయ్యా!'

'మళ్లీనా? ఎందుకు?'

'నాకు పెళ్లిలోపెట్టిన చీరకట్టుకుని, ఎలా వుంటానో చూద్దామని చెట్టునకోసి కొంచు పూలు పెట్టకున్నా. ఎందుకో పిన్ని ఆగదిలోని కొచ్చింది. నానాచీవాట్లు పెట్టింది.'

ఆమె నేత్రాలలో అమాయికత్వం, జాలి కనుపిస్తుంది.

'నాన్నగార్కి తెలిసిందా?'

'రాత్రి నాన్నగారుకూడా కలిశారు'

ప్రభ, పొంగి పొంగివస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది. వెక్కి, వెక్కి ఏడ్వ సాగింది. రమేషుహృదయం తరుక్కుపోయింది. ఆమె చూపులలోని దుఃఖం, నిస్సహాయత అతన్ని కలిచివేచాయి. కొంచెం సేపు ఏదో ఆలోచించాడు. ప్రభను దగ్గిరకు లాక్కుని ముద్దుపెట్టుకున్నాడు.

'ప్రభా! పోనీలే. అయిపోయిందేమో అయిపోయింది. విచారపడబోక'

'అన్నయ్యా!.. —'

'ఏమిటే చెల్లీ? చెప్పు పరవాలేదు'

'—ఏమీ లేదులే. నీవువెళ్లి ముఖం కడుక్కురా నేనిక్కడే కూర్చుంటా'

♦ ♦ ♦

నాలుగైదురోజులు గడిచాయి. రమేషు మనసు స్థిమితంలేదు. ప్రభకూడా అలాగే కనపడింది. ఒకరోజున ప్రభకు తీవ్రమైన కడుపునొప్పి వచ్చింది. రమేషు డాక్టరిని తీసుకొచ్చాడు. డాక్టరు ప్రభను పరీక్ష చేశాడు. 'పేగులలో బాధ; వెంటనే చెన్న పట్నం తీసుకుపోయి ఆపరేషన్ చేయించాలి' అని సలహాయిచ్చాడు.

రమేషు, డాక్టరు మిత్రులు.

ప్రభను రమేషు పట్నం తీసుకెళ్లాడు. రమేషు దగ్గరనుండి రోజు వుత్తరా లొస్తున్నాయి. ఆరోగ్యం చేకూరుతుందని తండ్రి భ్రమించాడు. ఒకరోజున ప్రభకు చాల ఎక్కువగావుందని వుత్తరం వచ్చింది. ఆ సాయంత్రమే 'టెలిగ్రాము' ప్రభ మరణించిందని. పిడుగువంటి వార్తకు తండ్రి కూలిపోయాడు. సంఘానికివెరచి తన కూతురియందు చూపించిన క్రూరత్వము తలపుకొచ్చింది...ఆ తలపులే అతనిని పీల్చివేయటం మొదలు పెట్టాయి. 'పోనీ, చనిపోయింది అదృష్టమంతురాలు'అని అపుడపుడు మనసును శాంతపరుచుకునేవాడు.

♦ ♦ ♦

అలాగే సంవత్సరం నాల్గు అడుగులు వేసింది. ఆనాడు దీపావళి ఎచటచూచినా టపాకీలమ్రోతలే. ఊరంతా కోలాహలంగా వుంది.

రమేషు పండుగకు యింటికొచ్చాడు. ఇల్లంతా వెలావెలాపోతుంది. ప్రక్కగదిలో నుంచి మాత్రం మూల్గులు వినపడుతున్నాయి. తండ్రి మంచముమీద బలహీనతతో పరుండివున్నాడు. రమేషు వెంటనే డాక్టరుని పిలుచుకొచ్చాడు. డాక్టరు జబ్బేమీ లేదన్నాడు. రమేషుకు అంతా బోధపడింది.

ఆ ఉదయము రమేషు రెండేండ్లపిల్లను ఎత్తుకొని తండ్రిదగ్గరకువచ్చి ఆయనకు అందించాడు. ఆపిల్లనుచూస్తె సంతోషం, దుఃఖం వచ్చాయి తండ్రికి; ఒక అవ్యక్త ప్రేమ అతనిని పెనవేసింది. కన్నులవెంట నీళ్లు బొటబొటకారాయి. ఆబిడ్డను తనివితీర ముద్దు పెట్టుకున్నాడు.

'గోపాలకృష్ణమూర్తిగారి మనుమరాలు'

'ఏమిటీ? రామమోహనరావు కూతురా?'

'అవును'

'అతను పోలీసుసూపరెంటు కాదా యిపుడు?'

'అవును'

'అతను వితంతువివాహం చేసుకున్నాడు కదూ?'

'ఊ'

'గొప్పవాళ్లాయను. వాళ్ళనేమిఅంటానికి వీలులేదు. సంఘం గొప్పవాళ్లనేమీ చేయ లేదు. తక్కువ వాళ్లమీద విరుచుకోపడు తుంది.—ఎప్పుడొచ్చాడు?'

'నేనూ అతనూ కలిసివచ్చాము. పాపం! బాల్యస్నేహం మరిచిపోలా. నేనంటే అతనికి చాలాయిష్టం. ఆనిక్కా మనయింటికొస్తాడు.

♦ ♦ ♦

రామమోహనరావు భార్యతో రమేషు యింటికొచ్చాడు. రమేషుతండ్రి నిర్ఘాంత పోయాడు. నిశ్చేష్టుడయాడు. అలాగే కుర్చీలో కూలబడిపోయాడు. కొంచెంసేపటికి తెప్పరిల్లాడు. అప్రయత్నంగా చేతులు జాచాడు. ప్రభ అతని కౌగిటిలో వాలింది. తండ్రి కూతురులు తన్మయులయారు.

ప్రభ ముఖంలో నూత్నవికాసము కన బడుతూంది. ఒకనాడు తనదుఃఖానికి, తండ్రి దుఃఖానికి కారణమైన నవమల్లికలు నేడు, ఆమె కచవల్లరులలో వోయ్యారముగా నిలిచివున్నాయి. ఆమెవదనమున ప్రజ్వలించు చున్న తేజో పుంజములచే, ఆయనముఖం కాంతియుతమైంది. శరీరమాంద్యము మాయమై పోయింది .....ఆరోజు వాళ్లిల్లు ఆనందసాగరం!

ప్రేమ ప్రతిఘటించింది. సంఘం నిరోధిం చింది. ప్రేమ జయించింది. సంఘం ఓడి పోయింది.

"దీనుఁడు"

మ॥ అసలేకోఁతి; నిషాబిగించినది; దయ్యంబంతటం బట్టుటన్ ।
దెసలం బర్విడి నిప్పుఁద్రొక్కఁగొనియెన్ ! దేలంతటం గుట్టనం ।
ట !! సరోజాక్షు, యిదేప్రకార మయినాఁడం జూడుమా: నీదు ది
వ్యసహాయం బొనఁగూడకున్న నిఁక నేమైపోదునో యిద్యోడన్ ॥